# శ్రీశ్రీ తో



**మధురవాణి:** శ్రీశ్రీ గారూ! మీరు వెజిటేరియనా, నాన్ వెజిటేరి యనా?

**శ్రీశ్రీ:** ఫస్ట్ థింగ్స్ ఫస్ట్. వేరీజ్ మై డ్రింక్? అసిరిగాడ్ని బజారుకి పంపించి ఇన్‌స్ట్రుమెంట్స్ అన్నీ రెడీ చెయ్యి-

**మధుర:** అంటే-

**శ్రీశ్రీ:** చికెన్ బిర్యానీ, మటన్ ఫ్రయ్, ఆమ్లెట్ తెప్పించు. రైస్, రెండు కప్పుల కర్డ్ చాలు సరిపోతాయి అవి ఇవి కలిసి

**మధుర:** చలసాని ప్రసాద్ గారొచ్చారు. అసిరిగాడ్ని పంపద్దు. అన్నీ ఆయనే తెస్తానంటున్నాడు.

**శ్రీశ్రీ:** ఏం?

**మధుర:** అసిరిగాడు కొంతమందు తను తాగేసి మిగిలినదాంటో నీళ్ళు కలిపేస్తాడ్ట. పైగా ఫుడ్‌లో కొంత లాగించేస్తాడని భయంట ఆ తరువాత బిల్లు లెక్కలో కమీషన్ కింద ఒకటీ రెండూ మింగేస్తాడ్ట.

**శ్రీశ్రీ** : సరే - నామందు నన్ను త్రాగనివ్వరు. నా కవిత్వం నన్ను రాయనివ్వరు ఏవంటాడు ప్రసాద్?

**మధుర:** నిన్న మీరు, ఫుడ్ మరకలూ డ్రింకు మరకలు చేసుకున్నవీ; మాసిపోయి డాగులు పడ్డవీ; లాల్చీ పైజమ్మాతో వచ్చార్ట కొత్త బట్టలు తెచ్చాడు మీరు నిన్నా మొన్నా స్నానం చేయలేదట మంగల్ని పిలిచి మీకు శుభ్రంగా తలంటోసి స్నానం చేయించి కొత్త బట్టలు కట్టించి ఆ పిమ్మట ఇంటర్వ్యూ తతంగం సాగించమంటున్నాడు

**శ్రీశ్రీ:** కవికి స్వేచ్ఛ లేకపోవడమంటే యిదే. తలంటూ గిలంటూ జాంతానై. నేనిలాగే వుంటాను.

**మధుర:** పోనీ గిరీశంగారి నైట్‌డ్రస్ వుంది అది ధరిస్తారా?

**శ్రీశ్రీ:** వాడి నైట్ డ్రస్ నేనా? నీకిది న్యాయమా మధురవాణీ - ఇవాళ గిరీశం గుడ్డలు తొడిగి రేపు మీరే నా గిరీశం అందామనా?

**మధుర:** ప్రతి వ్యక్తిలోనూ ఒక గిరీశం దాక్కొని వుంటాడు - కనుక్కోవాలి అంతే

**శ్రీశ్రీ:** నీ పెంకి నవ్వు కన్యాశుల్కం సినీమాలో సావిత్రి ట్రయ్ చేసింది ఎలావుంది?

**మధుర:** నానవ్వు పట్టుపడాలని కరటక శాస్త్రి శిష్యుడు ట్రయి చేశాడు ఆఁ, అవునూ; సినీమా మధురవాణి చేత 'ఆనందం అర్ణవమైతే' పాడించారు, అదేవిటండీ?

**శ్రీశ్రీ:** నామీద గౌరవం కొద్దీ వాళ్ళాపాట పెట్టారు.

**మధుర:** అంటే, నా మీద గౌరవం లేకా?

**శ్రీశ్రీ:** లుబ్ధావధాన్లు పెళ్ళిలో నువ్వయితే ఏం పాడేదానివి?

**మధుర:** అదేవన్నా నిజం పెళ్ళా - ఏ పాట పాడితే నేవిటి? అబద్ధపెళ్ళికి అదేదో వాయిద్యం అని మనవేపు ఓమోటు సామెత.

**శ్రీరంగం శ్రీనివాసరావు**

**శ్రీశ్రీ:** బతికించావు. అబద్ధ పెళ్ళిలో ఆనందం అర్థవమైతే పాడితేనేవిటి, అపనా తనా మనా పాడితేనేవిటి?

**మధుర:** తరంగమో, అష్టపదో, జావళీయో అందుకునేదాన్ని నేనైతే - మరి, పులి చంపిన లేడి నెత్తురు అంటే ఏవిటండీ?

**శ్రీశ్రీ:** వెరీ సింపుల్ - యిందులో అర్థం కాకపోవడానికేం వుంది?

**మధుర:** మీ కవిత్వానికి పులి చంపిన లేడి నెత్తురు కావాలన్నార్ట! అదేం కోరిక?

**శ్రీశ్రీ:** ఎవడా పుండాకోర్ - నీచేత యిటువంటి ప్రశ్నలడిగిస్తున్నది - వాడిపేరు చెప్పు?

**మధుర:** మీ కామ్రేడే నిత్యకవి! 'పులి చంపిన లేడి నెత్తురు కావాలోయ్ నవకవనానికి అన్నాడు మీ మహాకవి, పులి లేడిని చంపడం హృదయవిదారకమైన సంగతి కదా - అటువంటి నెత్తురు కావాలనడం బీభత్సం. నేనైతే యిలా రాస్తానా?' అని వాపోయాడు పాపం!

**శ్రీశ్రీ:** నేనూ అర్థం కాలేదు, నా మహాప్రస్థానం అర్థం కాలేదు, వాడికి. పోనీ నువ్వు చెప్పు-

**మధుర:** ఏవుంది, తెల్లబియ్యం పాటి మానికా-పులిచంపిన లేడి నెత్తురు పులిమీద తిరగబడమని లేళ్ళకు చెబుతుంది. కార్మికులు పులుల్లాటి యజమానుల మీద తిరగబడాలి అని సందేశం

**శ్రీశ్రీ:** నా పద్యం ఓటి జ్ఞాపకం వస్తోంది విను.

కుకవియన నా మతంలో
ఒకడే, తన గొప్ప యెదిరి న్యూనత చూసే
వికలమతి! వానిపై నా
చికటారిని నూరదలతు సిరిసిరిమువ్వా!

**మధుర:** మీరు సినిమా పాటలు చక్కగా రాశారు గదా - అందులో 'నా హృదయంలో నిదురించే చెలీ' అంటే ఎవరని అడిగితే మీరుచెప్పిందేమైనా బాగుందీ?

**శ్రీశ్రీ:** కమ్యూనిజం - అని జవాబు చెప్పాను. ఏం తప్పా?

**మధుర:** నా మొహంలా వుంది (నవ్వుతుంది) నోటికి ఏది వస్తే అది మాట్లాడే సెయ్యటమేనా?

**శ్రీశ్రీ:** నీ మొహానికేం, నీది మధురవాణి మొహం-!

**మధుర:** కమ్యూనిజం మీ హృదయంలో నిదురించే చెలి అన్నారే, ఆ మాట ఎంత అనాగరికంగా వుందో ఆలోచించారా? మీ కమ్యూనిస్ట్ కవుల్లో ఆవేశమే కాని ఆలోచన తక్కువనుకుంటా. ఒకవేళ వున్నా దాన్ని అదిమి చిదిమేసి నాశనం చేసుకుంటారు.

**శ్రీశ్రీ:** నన్నంటే పడతా. నా ఆదర్శాల్నంటే మాత్రం తిరగబడతా - నేనంటే ఎవరనుకున్నారో, ఇలా వక్రభాష్యాలు చెప్పేవాళ్లు! - హుఁ!

నేను ముసలివాణ్ని
కాను అసలువాణ్ని
పడగెత్తిన తాచుపాము బుసలవాణ్ని
పీడితుల్ని వెంటేసుకు మసలువాణ్ని
అందుకున్న ఆకాశపు కొసలవాణ్ని

**మధుర:** కమ్యూనిజం రష్యాలో కునికేసిందని గిరీశంగారు మొన్న చెబుతూంటే విన్నా మీరింకా 'లేలేలే రష్యా, రారారా రష్యా' పాటే పాడుతున్నారు. స్టాలిన్ కళ్ళజోళ్ళు తీసేసి ప్రపంచాన్ని చూడండి కామ్రేడ్.

**శ్రీశ్రీ:** నీకీ భోగట్టాలన్నీ ఎవరు చెబుతున్నారో అర్థం గాకుండా వుంది. రావప్పంతులికా యింగ్లీషు రాదు. పోలి సెట్టి, సిద్ధాంతి బేస్తు ఆడ్డానికి తప్ప పనికి రారు. గుంటూరు శాస్త్రుల్లు ఏవన్నా నీకు పేపరు చదివి వినిపిస్తున్నాడా? అటువైపు వాళ్ళకి తెల్లారి లేస్తూనే కాఫీతో పాటు పేపరుండాలి చేతిలో-

**మధుర:** 'నిన్నటి కమ్యూనిస్టులు
నేటి మర్యాదస్తులు
ఉదారవాదులు సంపన్న గృహస్థులు
వ్యాపారైక దృష్టులు
తపోభ్రష్టులు -'

అన్నారా లేదా? వుండండి-

'తెల్ల కమ్యూనిస్టులు
రక్తపాతాని కనిష్టులు
విప్లవానికి బహిష్కులు
ఇందిరారాధనలో శ్రేష్ఠులు
నవభారత ధార్తరాష్ట్రులా రివిజనిస్టులు!'

అని వాళ్ళని తిట్టి యింగ్లండు నుంచి ఫామిలీతో సోవియట్ రష్యా వెళ్ళడానికి ట్రయిచేస్తే - మీరు మమ్మల్ని తిట్టారు, మీ చేత తిట్టించుకుని మిమ్మల్ని మా దేశానికి ఆహ్వానించ గలమా అని మెత్తగా చివాట్లేశార్ట మీకు. నిజమా?

**శ్రీశ్రీ:** ఔరా నీకు యీ స్టుపిడ్ భోగట్టా అంతా ఎవరు జేరేశారు?

**మధుర:** చెప్పుకోండి చూద్దాం, జనాబ్ శ్రీశ్రీ అలీషాగారూ!

**శ్రీశ్రీ:** నా లిమరిక్కులు నీకు తెలుసే - ఆశ్చర్యం! ఎప్పుడు చదివావు?

**మధుర:** అసిరిగాడిచేత అప్పలస్వామిగారి లైబ్రరీ నుంచి తెప్పించుకున్నా

**శ్రీశ్రీ:** ఏడీవాడింకా రాలేదే - ఆ డబ్బులట్టుకు వాడు ఏ కల్లు కొట్టుకేనా ఛపాయించేశాడేవిటి చెప్మా?

**మధుర:** వెళ్ళింది వాడు కాదే! సౌజన్యారావు పంతులుగారిచ్చిన ఫ్లాస్కులో కాఫీ వుందో లేదో చూసి తెద్దునా?

**శ్రీశ్రీ:** కాఫీ - కాఫీ - కాఫీ! నాలుక పీక్కుపోతుంటే - ఫస్ట్ థింగ్స్ ఫస్ట్! అన్నానా, లేదా? వేరీజ్ మై డ్రింక్?

**మధుర:** ముందు మందిస్తే మాట విన్నని మీ శిష్యుడు వార్నింగిచ్చాడు

**శ్రీశ్రీ:** ఆష్షో యీ శిష్యులకి విసిన కర్రలకీ (ఫాన్స్) బందీనైపోబట్టి గదా నాకీ అవస్థ - హా హతవిధీ.. కటకటా లొటిపిటా

**మధుర:** మీరు కన్యాశుల్కం బీభత్సరస ప్రధానమైన నాటకం అని ఎందుకన్నారు? మా గురువుగారు సరసులే గాని బీభత్సపుమనిషి కారే?

**శ్రీశ్రీ:**
బీభత్సం రసరాట్టు
దానిస్థాయి జుగుప్స
అజీర్ణాని కౌషధమది
అనవసరం విచికిత్స

అసహ్యాన్ని పుట్టించడ
మన్నదె నా హిత భావన
ఎవరిమీద ఎందుకోస
మన్నది మీ అవగాహన
కరుణరసం శృంగారం
వాడిన పూరేకులు
వీరరసం బీభత్సం
ఈనాటి తుపాకులు

**మధుర:** మీ కమ్యూనిజం కూడా యిప్పుడు వాడిన పూరేకుల్లో కలిసిపోయింది గురజాడ వారికీ మీకూ కళ్ళజోళ్ళు వేరు వేరు

**శ్రీశ్రీ:** మా గురువుగారు మనుషుల్లో చూడమన్నాడు నేను నిలబడి మనుషుల్లో చూస్తున్నాను కన్యాశుల్కం చూశాక నా కనిపిస్తుంది-

నేనూ ఒక మూర్ఖుణ్నే
ఐనా నాకన్న మూర్ఖులగపడుతుంటే
ఆనందపారవశ్యము
చే నవ్వక తప్పలేదు సిరిసిరిమువ్వా.

**మధుర:** పద్యాలకి పళ్ళు రాలవు, చింతకాయలు చెట్టుమీదే వున్నాయి, ఏవంటారు?

**శ్రీశ్రీ:** తెలుగు స్వతంత్రలో 'విషాదాంధ్ర' పొట్టి శ్రీరాములు గారు పోకముందు రాశా- ఇవన్నీ నీకెవరు చెప్త .

**మధుర:** ఇంకెవరు - కె వి రమణారెడ్డి గారు కొన్నాళ్ళు మా యింట్లో 'శ్రీశ్రీ లెక్చర్లు' యిచ్చారు

**శ్రీశ్రీ:** మీ యింటికాయన ఎందుకొచ్చాడు?

**మధుర:** మహోదయం అని గురజాడ వారిపై పెద్ద పుస్తకం రాస్తూ ఏవో సందేహాలుంటే అడగటానికి వస్తానంటే గిరీశం గారు తీసుకొచ్చారు.

**శ్రీశ్రీ:** వాళ్ళిద్దరూ ఫ్రెండ్సా-

**మధుర:** వెంకటేశానికి కావలి కాలేజిలో యింగ్లీషు ట్యూటర్ పోస్టుకావాలి. రమణారెడ్డి గారితో చెప్పి యిప్పిస్తావని గిరీశంగారు తీసికెళ్ళి పరిచయం చేశార్ట!

**శ్రీశ్రీ:** నా అనుభవంలో శత్రువుల కంటె మిత్రుల వల్లే ఎక్కువ డామేజి జరుగుతూ వుంటుంది.

**మధుర:** మీ కవిత్వం అర్థం గాకపోయినా మిమ్మల్ని ఆకాశానికెత్తేసి ఆరాధించడం యువకుల్లో ఫాషనైపోయిందనీ, అజ్ఞానుల ఆరాధన మిమ్మల్ని మహాకవి చేసిందనీ, ఓ విమర్శ వుంది. దానికి మీరేమంటారు?

**శ్రీశ్రీ:** పుంస్త్వమైన తనూ సౌందర్యం నా కవిత్వానిది వీరేశలింగం తరవాత నా అంత సువిఖ్యాతుడూ సంస్థ కల్పుడూ అయిన కవి - వ్యక్తి మరొకడు లేడని నేను కె వి ఆర్ ని అనమనలేదే? ప్రపంచం; ముఖ్యంగా యువతరం, నా వెంట వచ్చిందని అసూయపడే వాళ్ళకు నేనేమని జవాబు చెప్పాలి? ఎందుకు చెప్పాలి?

**మధుర:** తూర్పు గాలి కంటె పడమటి గాలికి మీరు ఎక్కువ స్పందించార్ట సాహిత్య అంతర్జాతీయత ముందు వచ్చి రాజకీయ అంతర్జాతీయత తరవాత ఏర్పడిందట తమకు

సరిహద్దులు లేని
సకల జగజ్జనులారా!
మనుష్యుడే నా సంగీతం,
మానవుడే నా సందేశం!

అనగలిగారు గనకే కుర్రకారు మీకు బ్రహ్మరథం పట్టింది అందుకు, ఆయనకాఅసూయ ఆకాశమంత యెత్తు ఎదిగిన వాడ్ని అంగుష్ఠమాత్రులు వెక్కిరిస్తూంటారు

**శ్రీశ్రీ:** మహాకవి అయ్యాక మర్యాదలకి అలవాటు పడతాం ఎంత చిన్న అమర్యాదనైనా భరించడం కష్టం.

**మధుర:** ఎవరైనా యీ యిల్లు నాది, యీ తోట నాది, యీ ఆస్తి నాది, యీ డబ్బు నాది అనే వాళ్ళను చూశాము గాని యీ యుగం నాది అన్నవాళ్ళను చూళ్ళేదు. ఎందుకలా అన్నారు?

**శ్రీశ్రీ:** అదా - దాని గురించి ఓసారి ఎవరితోనో అన్నా యావదాంధ్ర దేశంలో ఏ యింటికైనా వెళ్ళి అమ్మా నేను శ్రీశ్రీని నాకాకలేస్తోంది అంటే ఏ తల్లి అయినా పిల్చి నాకింత అన్నం పెడుతుంది. అంతకంటె నాకేం కావాలి?

**మధుర:** మీరింత సింప్లుల్ మనిషి గనకే మీరు యువతరాన్ని యిట్టే ఆకర్షిస్తారు. 'నీ

గళగళన్మంగళ కళాకాహళ హాళాహళిలో' - యిది కుర్రాళ్ళ కెంతమందికి అర్థం అయిందని వాళ్ళు మీ వెంట బడుతున్నారని కొందరు కవులడుగుతున్నారు.

**శ్రీశ్రీ:** ఎవరా కవులు?

**మధుర:** తమని మీతో పోల్చుకుని మిమ్మల్ని తక్కువ చేసేవాళ్ళ నేమనాలి?

**శ్రీశ్రీ:** నాకేమో లోకంలో

కాకవులే కానరారు, కవిదూషణ న

న్నాకర్షించదు, రచనో

త్సేకాన్నే మెచ్చుకొందు సిరిసిరిమువ్వా

**మధుర:** మరి లిమరుక్కుల్లో కళాకాళీ, మిల్క్ ఆఫ్ మెగ్నీషియాలు రాయకుండా వుండాల్సింది. ఇహిహీ, తెలుసా, కిరాణాకొట్టు కూడా మీరు రాయాల్సినవి కావు పైగా నక్సలైట్ల విధ్వంసకాండకు మీరిచ్చిన బ్లాంక్ చెక్కు అస్మదీయులకోరకం సర్టిఫికెట్టు తస్మదీయుల కింకోరకం అన్నట్లు లేదా?

విప్లవకారుల విధ్వంస
బీభత్సకాండకు నా ప్రశంస
అదెన్నడూ కానేరదు హింస
అది నూతన చేతనారిరంస
మానవ మానస మానసరోవర హంస

హింసకు యోగ్యతా పత్రాలివ్వడం చాలా డేంజరు గురువుగారూ!

**శ్రీశ్రీ:** అది నీ అభిప్రాయం కవుల నీడ ప్రపంచం మీద పడుతుంది. ప్రపంచం కవుల మీద తన ప్రేరణ ముద్రిస్తుంది గతంలో జీవించే శాస్త్రీలు మాత్రమే వర్తమానానికి స్పందించటం మానేస్తారు. ఇంతకీ, కబుర్లు చెప్పించేస్తున్నావు; కాని, వేరీజ్ మైద్రింక్? ద్రవాలూ లేవు, ఉపద్రవాలూ లేవు.

**మధుర:** పక్క గదిలో అన్నీ రెడీ చేసి వుంచాం మీతో ఎవరు కంపెనీ?

**శ్రీశ్రీ:** శ్రీశ్రీకి శ్రీశ్రీయే కంపెనీ

**మధుర:** చేదు విషం జీవఫలం కవిత కరక్కాయ సుమీ అన్నారు (నవ్వు)

**శ్రీశ్రీ:** ఎందుకు నవ్వుతావు?

**మధుర:** పూర్వ కవులెవరూ కరక్కాయలు వాడలేదు. ద్రాక్షపళ్ళూ, కొబ్బరికాయలూ, దొండపళ్ళూ వాడారు కాని-

**శ్రీశ్రీ:** కవిత దబ్బకాయలు సుమీ, చింతపండు అనికానీ దోసపండు అని కానీ ఎందుకు వాడలారంటావు?

**మధుర:** నాటెటాల్ శ్రీశ్రీగారూ! కరక్కాయ ఎలా వచ్చిందని నా బాధ.

**శ్రీశ్రీ:** అలా అడిగావు, బాగుంది. నాఫస్ట్ డ్రింకు గురించి చెబుతాను విను.

**మధుర:** మహానుభావా! నేనడిగింది కరక్కాయ గురించి.

**శ్రీశ్రీ:** వన్ థింగ్ లీడ్స్ టు ఎనదర్ మొట్టమొదటిసారి మద్రాసు పోర్టులో పనిచేసే ఫ్రెండ్ ఒకతని రూమ్‌కి వెళ్ళాను నేను అతను పోర్టు నుంచి చవగ్గా ఒక రమ్ బాటిల్ తెచ్చి రూములో దాచాడు అంతకు ముందు నేను డ్రింక్ ముట్టుకోలేదు పైగా, నా ఫ్రెండ్, నేను మందు ముట్టనని నా మీద నమ్మకంతో డ్యూటీకి వెళ్ళాడు. నాకెందుకో రమ్ము రుచి చూడాలనిపించింది అంతే-సీసా ఓపెన్ చేసి గటగట మంచి నీళ్ళు త్రాగినట్లు తాగేశాను పూర్తిగా తరవాత మూడు రోజులకు గాని తెలివి రాలేదు.

**మధుర:** గొప్ప పనిచేశారు ఏకేశ్వరోపాసన కొంప ముంచేది ఇంతకీ మీ ఫస్ట్ డ్రింక్ గురించి ఎందుకు చెప్పినట్లు?

**శ్రీశ్రీ:** ఆ డ్రింకు మైకంలో మద్రాసు పోర్టులో ఎగుమతి అవుతున్న కరక్కాయ బస్తాలు చూశాను. డ్రింకు మీద నాకు 'చేదు విషం జీవఫలం కవిత కరక్కాయ సుమీ' అన్న మాటలు పలికాయి

**మధుర:** 'చిత్రం చిత్రం, మహా విచిత్రం' అన్నట్లు వున్నాయి, మీ మాటలు

**శ్రీశ్రీ:** నేను మితభాషిని

**మధుర:** (నవ్వుతుంది) అంటే అమితంగా డ్రింకు పుచ్చుకునే వారని కాబోలు (మళ్ళీ నవ్వు) అవునూ, 'దొంగ లంజకొడుకు లసలే మెసలే యీ ధూర్తలోకంలో' అని మహాప్రస్థానం అంకితం పద్యంలో రాశారు. అంటే ఎవరని-?

**శ్రీశ్రీ:** నువ్వు ఎవరనుకుంటే వారే - అసలు వాళ్ళ గురించి నా కంటే నీకే ఎక్కువ తెలిసుండాలి

**మధుర:** మీ ఎర్ర చెడ్డీల వాళ్ళు; కేపిటలిస్టుల్నీ, ముఖ్యంగా అమెరికా వాళ్ళని, తిట్టారని మురిసిపోతుంటేనూ -

**శ్రీశ్రీ:** కొంపెల్ల జనార్దనరావుని హింసించి అతని దారిద్ర్యానికీ మృత్యువుకీ కారణమైన వాళ్ళని కాబోలు అందులో తిట్టాను-

**మధుర:** పూటకూళ్ళమ్మని సాయం తీసికెళ్ళాల్సింది మీరు. . తిట్లింకా ఘాటుగా వొచ్చుండేవి.

**శ్రీశ్రీ:** ఆదండు ముండ గిరీశానికి సూటయినట్లు నాకు సూటుగాదు యింతకీ ఎవరంటే-చందాలు కట్టని పాఠకులు, సహకరించని పత్రికలవాళ్ళు యింకా యితర శాల్తీ లయివుంటారు. నేను మహాప్రస్థానంలో వాడిన దొంగలంజకొడుకులనే మాట ఎంత విస్తృత మయినదంటే ఎవరికి కావలసిన వాళ్ళని వారు చేర్చుకోవచ్చు. 'తిట్టు' అనేది మనకు కొత్తదేమీ కాదు గదా!

**మధుర:** మీ మొహం చూస్తే మీరు నాస్తికుళ్ళా పైకి కనపడరు. మీరు తెచ్చే విప్లవానికీ నాస్తికత్వానికీ ఏదైనా దగ్గర చుట్టరికమా?

**శ్రీశ్రీ:** దొంగభక్త పరాధీనుడైన భగవంతునికీ, గాంధీగారి రామరాజ్యానికీ, కాంగ్రెస్ రాజకీయాలకీ వున్న చుట్టరికమే మాకు యిన్స్పిరేషన్. మాదీ అదే చుట్టరికం మేడం!

**మధుర:** చాల్చాలు! ఏమి నేర్చుకుపోయారు? మీకేనా భగవంతుడు తెలివితేటలిచ్చింది? మీవి పాదరసాలూ మావి మట్టి బుర్రలూనా?

**శ్రీశ్రీ:** ఎందుకలా బెజవాడ ఎండల్లా రెచ్చిపోతున్నావు?

**మధుర:** మీవాళ్లు నవజీవన బృందావన నిర్మాతలూ మావాళ్లు కీటక సన్యాసులూనా? పండితాఃసమదర్శినః అన్నారు గీతలో - కమ్యూనిస్టులేవన్నా అవతార పురుషులా?

**శ్రీశ్రీ:** నా మరో ప్రస్థానంలో నువ్వు చూడలేదా?

**మధుర:** ఏముందక్కడ మీప్రగల్భాలు తప్ప-

**శ్రీశ్రీ:** చెప్పుకో చూద్దాం. అవే అవే మాకవులకు కర్ణాభరణాలు.

**మధుర:** గుర్తొచ్చింది - నువ్వు మధురవాణివి కావాలంటే ముందు కమ్యూనిస్టువి కావాలి. నువ్వు కన్యాశుల్కం చదవాలంటే ముందు కమ్యూనిస్టువి కావాలి. నువ్వు సాంబారు తాగాలంటే ముందు కమ్యూనిస్టువి కావాలి. ఇదేనా మీ కల్లోల-నక్సల్బరీ-విరసం దశాబ్దం?

**శ్రీశ్రీ:** నన్ను రావప్పంతుల్ని చేసి ఆట పట్టిస్తున్నావు. నన్నేవన్నా అన్నావంటే మావాళ్లు మధురవాణికి సామాజిక స్పృహలేదని వ్యాసం రాసి నిన్ను మీవూరు బండివాడ్ని తోడిచ్చి కాంగ్రెసులోకి తోలేస్తారు జాగ్రత్త!

**మధుర:** దేశమంటేమనుషులోయ్ అని గురజాడ రాస్తే మీరు దేశమంటే ఒక మురికి లాండ్రీ అన్నారు గుర్తుందా? తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు అవునా?

**శ్రీశ్రీ:** ఏమి చెప్తున్నావు! కానీ, నువ్వు నన్ను తలవాచేలా తిడుతున్నా నాకు అమ్మవారొస్తే వేపమండలతో విసిరినంత హాయిగా వుంది.

నీవు చూపిస్తున్న బాట
యథాస్థితి కొక కంచుకోట
హింసతోనే సృష్టి పుస్తది
హింసతోనే మార్పు వస్తది

**మధుర:** పుస్తది వస్తది అంటూ ఏవిటా దిక్కుమాలిన భాష? వేమనగారు కూడా తమరు రాసిన 'నిన్నటి జట్కావాలా' చూసి కళ్ళు తిరిగి పడిపోతారు సామాజిక స్పృహ తప్పి.

**శ్రీశ్రీ:** అంటే ఆనంద పారవశ్యం చేతా?

**మధుర:** నవయుగ భగవద్గీతా ఝుంఝుని ప్రసరిస్తాను, హరోం హరా కదలండీ అని రాసిన 'మహానుభావుడివి' 'గుర్రానికి రెండేపులా రగతం' అంటూ 'మరో ప్రస్థానం'లో రాయడం నవబా కామ్రేడ్?

**శ్రీశ్రీ:** ఎటువంటి వాళ్ళు నాపక్కన వుంటే అటువంటి వాళ్ల ప్రభావం నామీద పడుతుంది. ప్రజల భాషలో రాయడం ప్రాక్టీసుచేస్తే తప్పా?

**మధుర:** ఆగవయ్యా యెర్రి బ్రేమ్మడా! అన్నట్టు; నువ్వు బ్యామ్మణ్ణను కోవడం మానేశావటగా! అది మీకు మీరే కితాబిచ్చుకోవడం, తనే తుమ్ముకుని తనే శ్రీరామరక్ష అనుకోడం కాదా! కుర్రాళ్ళతో పోటీ పడాలని తవరు గుర్రందిగి గాడిదెక్కినట్లుగా వుంది

**శ్రీశ్రీ:** మావాళ్లను దొంగదెబ్బలు కొడుతున్నావు. విరసం అంటే నీకెందుకంతలోకువా?

**మధుర:** మనం ఎవరిని ప్రేమిస్తున్నామో వారినే విమర్శిస్తాము. ఆమెన్!

**శ్రీశ్రీ:** ఇది విప్లవ విజయవేళ, ఎవరూ కాదనలేరు! అధవా బధిరాంధులు కాదంటేఅవుతారు!

**మధుర:** కోతల్లో గిరీశంగారిని మించిపోయినట్లున్నారు ఎంతసేపూ మీకు ఆత్మస్తుతీ పరనిందా; సిగ్గులేకుండా!

**శ్రీశ్రీ:** మహాకవిని తిడుతున్నావ్ చరిత్ర నిన్ను క్షమించదు

**మధుర:** నువ్వు కమ్యూనిస్టువి కావాలంటే
మనిషిగా జీవించాలంటే
ఇప్పుడే ఎర్రసేనలో కలియాలి
నువ్వు ఎర్రసేనలో కలియాలి - ఎక్కడుందండీ మీ ఎర్రసేన?

**శ్రీశ్రీ:** ఎర్ర సేనకాదు మాది లోకానికి కన్నెర్ర సేన

**మధుర:** ఈ శబ్దచాంచల్యమే మీకొంప ముంచింది. మాటల్ని పేల్చి అన్నీ సాధించామనుకుంటారు మీది విప్లవ కవితా చాంచల్యమే కాని చైతన్యం కాదు

**శ్రీశ్రీ:** పొద్దున్నే లేచి ఎవరి మొహం చూశానో .మంచంకింద దాక్కున్న రావప్పంతుల్లా అయిపోయాను

**మధుర:** ప్రతి కవికీ జీవితంలో ఓ చీపురుకట్ట సరసం వుంటుంది తప్పదు

**శ్రీశ్రీ:** ''ఏం యిలవైన మాటలు యింటున్నాం!'' లోకం పూటకూళ్ళమ్మ; మరియు ఆమె చేతిలో చీపురుకట్ట జీవితం అంటే ఎస్కేపు - మధురవాణి మంచంక్రింద దాక్కోవడం.

**మధుర:** విప్లవ మహాకవికైనా - సరసము విరసము కొఱకే!

**శ్రీశ్రీ:** బాబ్బాబు నీకు పుణ్యం వుంటుంది విరసం హాంగోవర్ మానేసి యింకేదైనా మాట్లాడరాదూ?

**మధుర:** కరటక శాస్త్రి వేయిపడగల్ని తెలుగులోకి ట్రాన్స్లేట్ చేస్తున్నాడ్ట!

**శ్రీశ్రీ:** వేళాకోళానికైనా హద్దూ పద్దూ వుండాలి.

**మధుర:** మీ మరో ప్రస్థానం చైనీస్‌లోకి గిరీశంగారు అనువదించగా లేనిది వేయిపడగల్ని కరటకశాస్త్రి శిష్యుడు...

**శ్రీశ్రీ:** స్టుపిట్. నాకు కోపం వస్తే మనిషిని కాను

**మధుర:** అల్లాగే కనిపిస్తోంది. మీ ఇన్‌స్ట్రుమెంట్స్ అన్నీ రడీ - మీ డ్రింకు రడీ. మీకు మీరే కంపెనీ. పక్క గదిలో అన్నీ అరేంజి చేశాను. పుడ్డు సంగతి సరేసరి.

**శ్రీశ్రీ:** (తనలో) గానుగలో తెలకపిండి ఆడించినట్లు నన్నాడిస్తోంది. మధురవాణితో మాట్లాడి జయించుకు రావడం సులభం కాదు. (పైకి) నువ్వు వచ్చి పక్కన కూర్చుని కంపెనీ యిస్తే అరిగిపోతావా?

**మధుర:** నేనూ యీ వృత్తి మానేసి చాలా కాలం అయింది. భగవద్గీత తెస్తాను పుచ్చుకుంటారా?

**శ్రీశ్రీ:** ఓ సిజర్ సిగరెట్ కాల్చుకుంటా. పోనీ అగ్గిపుల్లకైనా నోచుకోలేదా? (అగ్గిపుల్ల గీస్తుంది మధురవాణి. శ్రీశ్రీ సిగరెట్ ముట్టించుకుని అతని స్టయిల్లో పీలుస్తూ వుంటాడు) ఆశయాలు సంఘర్షించే వేళ ఆయుధం అలీనం కాదు. (మత్తులో) నవధర్మం మానవధర్మం, అణవశక్తి కన్న మానవశక్తి మిన్న (అగ్ని కవిత్వం చదువుతాడు)

ఔను మరి బూర్జువా వర్గాలన్నా
పోలీసు రాజ్యం
పూజారి రాజ్యం అన్నా
నాకు విపరీతమైన ద్వేషం ..

**మధుర:** కాస్త చల్లని మజ్జిగ పుచ్చుకోండి పైత్యం దిగుతుంది వద్దు, యింక మానరా? - నామీదొట్టు. అమృతం - పుచ్చుకుని దేవతలూ, పుచ్చుకోక రాక్షసులూ చెడ్డారు.

**శ్రీశ్రీ:** శుక్రాచార్యుల వారిమాటేమిటి? కచ దేవయాని కథ నీకు నృత్య నాటిక రాసిస్తా. (మత్తెక్కి) జరత్కారుని చమత్కారంలాగు నన్ను నేను తిరగేసి తొడుక్కున్నాను....అర్థం లేదు అలాపన - అయితే - అబద్ధం కాదు ఆశ్చర్యం (తనలో) ఆఖరిమాట మొదటిమాట ఆశలకే అనంతం, అప్పారావు నానేస్తం. ఆంధ్రత్వం నాశాపం. (గ్లాసు గోడకేసి కొడ్తాడు.) తెలుపురంగు సత్యానిది, పసుపురంగు పైత్యానిది, నలుపురంగు చీకటిది, ఎరుపురంగు ఆకలిది!

**మధుర:** మరో ప్రపంచం పిలిచింది, మరో ప్రపంచం పిలిచింది, అని మీరు మాత్రం మరో ప్రపంచంలోకి వెళ్లిపోయారు; మమ్మల్ని యిక్కడే వదిలేసి.

* * *

శ్రీశ్రీ మధురవాణీ క్యారమ్ బోర్డ్ ఆడుతూ వుంటారు. మధ్య మధ్య శ్రీశ్రీ మధురవాణికి క్యారమ్స్ ఆట బోధిస్తూ వుంటాడు. మధురవాణి మైనస్ చేస్తుంది.

**శ్రీశ్రీ:** మధురవాణికి మైనస్సా? మరో మైనస్సు చెయ్యి. రెండు మైనస్సులూ ప్లస్సవుతాయి.

**మధుర:** అదుగో రెడ్ మళ్ళీ మీదే. రెడ్ కీ ఫాలో అప్ వుందా?

**శ్రీశ్రీ:** రెడ్ ఎప్పుడూ నాకే...రెడ్ కి ఫాలోయింగ్ ఎందుకు లేదు? వుండబట్టే కదా, అంతా మన్ని ఫాలో అవటం-

**మధుర:** క్యారంబోర్డులో రెడ్డూ అరుణోదయంలోని ఎరుపూ రెండూ ఒకేలా కనిపిస్తాయా మీకు?

**శ్రీశ్రీ:** నాకంతా ఎర్ర బావుటా నిగనిగలూ హోమజ్వాలల భుగభుగలే కదా! కొందరికి ఎరుపంటే భయం, భయం! నీకూనా?

**మధుర:** ఆట రాక - మీతో తూగలేక (నవ్వు). అన్నట్లు క్రితంసారి మన మాటల్లో వరస తప్పి మీకు ఎక్కువ మైనస్సులే పడ్డాయి. క్షమించాలి రెండు శ్రీలు ధరించి రెండు పెగ్స్ బిగించి వరలు శబ్దం విరించి అన్నారు కాని. . .

**శ్రీశ్రీ:** సందేహించకు . నువ్వడగదల్చుకున్నది అడిగేసెయ్ మై లైఫ్ ఈజేన్ ఓపెన్ బుక్.

**మధుర:** రెండు శ్రీలతో బాటు రెండు స్త్రీలు ధరించి అని కూడా అనుంటే బావుండేందేమో .

**శ్రీశ్రీ:** నీ చమత్కారానికి నా త్రీఛీర్స్. కవులకి అన్నీ ఎక్కువే - ఆయావ అలాంటిది అదొక జవాబులేని ప్రశ్న. నా ఆత్మ చరిత్రాత్మ కథ చదవ లేదా?

**మధుర:** కమ్యూనిస్టులకి కూడా ఆత్మలుంటాయా ?

**శ్రీశ్రీ:** వేళాకోళానికైనా హద్దూ పద్దూ వుండాలి ఈ ఆత్మానాత్మ విచారం ఎందుకొచ్చింది నీ కిపుడు?

**మధుర:** (నవ్వి) నేను మిమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తున్నానా, మీరే నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నారా, తెలీటం లేదు గనుకా.

**శ్రీశ్రీ:** ఎవ్వరని యెంతురో నన్ను - శ్రీశ్రీ అలుపులేని అన్వేషి, వెనుదిరగని సాహసి, నిరంతర ప్రయాణీకుడు, ఏ మజిలీ దగ్గరైనా ఆగుతాడు కాని ఎక్కడా ఆగిపోడు

**మధుర:** అని మీకు చలసాని యోగ్యతా పత్రం యివ్వాలా? ఎవ్వరూ మీ వీపుతట్టి ఫూల్స్ కాకూడదని చలంగారే అన్నారు సర్టిఫికెట్లకు అందనంత ఎత్తుకు ఎదిగిన మీకు నిజంగా మెప్పులూ మెహర్బానీలు కావాలా? నా కనిపిస్తుంది పాండురంగ మహాత్మ్యం రాసిన తెనాలి రామకృష్ణుడే యీ జన్మలో శ్రీశ్రీగా మళ్ళీ పుట్టాడేమోనని - కామ్రేడ్స్ కి పునర్జన్మలుండవు కానీ.

**శ్రీశ్రీ:** మహర్షి చలంగారు కాబోలు - యీ జన్మలో ఫలానా ఫలానా కవులు క్రితం జన్మలో ఎవరై వుంటారని సారీస్ నడిగి జన్మాంతరాలలో కెళ్ళి కనుక్కోవడానికి ట్రయి చేశారు. నీ మాటలలాగున్నాయి. రుక్కాయి నీకు తెలుసా?

**మధుర:** సిజర్ సిగరెట్లమీద పద్యాలు చెప్పిన శాస్త్రి గారేనా - ఎందుకు తెలీదు? నండూరి సుబ్బారావుగారు పూర్వజన్మలో క్షేత్రయ్య అనీ.. విశ్వనాథ సత్యనారాయణగారు క్రితం జన్మలో భవభూతి అని, జరుక్ శాస్త్రిగారనే ఆయనేమో గత జన్మలో తిక్కన అని; ఈశ్వరుడు చెప్పారటగదా!

**శ్రీశ్రీ:** మరి చలం గారెవరట?

**మధుర:** చలం గారి గత జన్మలన్నీ స్త్రీ జన్మలేనట వరసగా. మిమ్మల్ని కూడా అరుణాచలం రమ్మని బ్రతిమాలార్ట చలం. నిజమా?

**శ్రీశ్రీ:** అవును. నాకు జబ్బు చేసినప్పుడు రమ్మన్నారు అప్పుడు నాకెలా తెలుస్తుంది?

**మధుర:** మీ మహాప్రస్థానానికి చలం పీఠిక-

**శ్రీశ్రీ:** నాకేం తెలీదు జరుక్కే రాయించాడు

**మధుర:** అది కాదు అందులో ప్రపంచం బాధ అంతా శ్రీశ్రీ బాధ అన్నారు చలం.

**శ్రీశ్రీ:** ఏమిటి దానికి నీ అభ్యంతరం?

**మధుర:** అహ్హ - అందరి బాధ మీ బాధెందుకయింది అందులో కొందరి బాధ మీ బాధ.

**శ్రీశ్రీ:** ప్రపంచం బాధంతా నా బాధని నేనన్నానా? అలా అన్నది చలంగారు నన్ను మీరంతా నేను అనని వాటికి యిలా నిలదీస్తే ఎట్లా?

**మధుర:** అది నా మాట కాదు. అన్నది ఒకానొక నారాయణరావు

**శ్రీశ్రీ:** అమ్మ దొంగా - అతను నీకెలా తెలుసు?

**మధుర:** అది నా వృత్తిధర్మం. హెడ్ కానిస్టేబులు, సిద్ధాంతి, కొండభొట్లు రామప్పంతులు ఎట్లా తెలిసారో వీళ్ళంతా అట్లానే తెలిశారు అన్నట్లు ఆరుద్ర ఫాదరో ఎవరో మిమ్మల్ని కిడ్నాప్ చేశార్ట మీ పెళ్ళికి ముందు ? (నవ్వు)

**శ్రీశ్రీ:** నువ్వే రాయ కూడదా, నా చరిత్రాత్మ చరిత్రాత్మక జీవిత చరిత్ర - నన్నిలా ఏడిపించకపోతే....?

**మధుర:** ఎవరు వద్దన్నా కె.వి. రమణారెడ్డి గారు రాయక మానడు. మరోళ్ళూ మరోళ్ళూ మీ బయోగ్రఫీ ముట్టుకుంటే పాపం విరసం వాళ్ళు ఊరోసుకోరూ

**శ్రీశ్రీ:** నీకు అతనంటే పడదా? విరసం ప్రథమ సెక్రట్రీ

**మధుర:** మీది విరసం చిరునామా కదా!

**శ్రీశ్రీ:** నా మరణాంతర జీవితం గురించి, చచ్చి స్వర్గాన - కాదు కాదు; - నరకాన-వున్న నాకేం తెలుస్తుంది?

**మధుర:** మీకూ ఆరుద్రగారికీ గొడవలెందుకు వచ్చాయి?

**శ్రీశ్రీ:** నన్నడుగుతావేం. ఆరుద్రనే అడుగు, నీకంతగా కావలిస్తే !

**మధుర:** చుట్టాల్లో మీకు సహజంగా పరపతి తక్కువ. అసలు ఆలోచిస్తే మీ బాధే ప్రపంచపు బాధ అయింది (నవ్వు)

**శ్రీశ్రీ:** నవ్వు, నవ్వూ, నీ వెటకారం పడడం కూడా నాకో ఎడ్యుకేషన్-

**మధుర:** ఎంత మాట! అడుగు జాడ గురజాడది, నాది భావికి బాట అన్నది మీరే కదా - అయితేను, మీ జీవిత చరిత్ర రాసేవారికి మీరిచ్చే సలహా ఏమిటి?

**శ్రీశ్రీ:** జీవిత చరిత్ర రాయొద్దని-

**మధుర:** ఏం?

**శ్రీశ్రీ:** జీవిత చరిత్రలంటే అబద్ధాలూ అతిశయోక్తులే కదా!

**మధుర:** అలాగంటే మరి మీ కవిత్వాల మాటేవిటి?

**శ్రీశ్రీ:** నా జీవితం సాహిత్యం రెండూ ఒకటే - మహాప్రస్థానానికి ముందూ, మహాప్రస్థానం తరువాత!

**మధుర:** భజగోవింద శ్లోకాలు మిమ్మల్ని చాలా ఉత్సాహపరిచాయని విన్నాను నిజమా?

**శ్రీశ్రీ:** వాట్నో ఛందస్సు చూసేవామరి! తెలుగు వ్యవహారికం అన్ని రకాల ఛందస్సులనూ - భజగోవిందం నుంచి భుజంగ ప్రయాతాల నుంచి లిమరిక్కుల దాకా లొంగ దీసుకుని స్వారీ చేయగలదని నిరూపించానా లేదా? అదే నా గుంజాడ అడుగుజాడ - నడకలో అందాలంటే నీవీ నావే.

**మధుర:** మీది నడకా? మీరు విమాన వేగంతో ప్రయాణిస్తూంటే వాళ్ళు మిమ్మల్ని వెనకనుంచి పల్లకీలో వెంబడిస్తున్నారు అవునా?

**శ్రీశ్రీ:** వాళ్ళు అంటే-

**మధుర:** మీకు గిట్టనివాళ్ళు

**శ్రీశ్రీ:** విలయాన్నీ ప్రళయాన్నీ తుపాను బీభత్సాన్నీ ప్రాచీన అలంకార శాస్త్రాలతో తూచి యిది సాహిత్యం కాదంటారు, యిది సంప్రదాయం కాదంటారు. వాళ్ళు కవిత్వాన్ని - అందులో నా కొత్త కవిత్వాన్ని - ఫాలో కాలేని-

**మధుర:** తెలిసింద్తెలిసింది.

**శ్రీశ్రీ:** ఏమిటి?

**మధుర:** ఆ కడప రారాగారంటారే, ఆయన పీళ్ళని ఓ ఉతుకు ఉతికేడట కదా!

**శ్రీశ్రీ:** ఈ బాధలేవో పడలేక చలం శ్రీశ్రీ కవిత్వాన్ని తూచేందుకు తూనిక రాళ్ళు నావద్ద లేవన్నాడు. అది గ్రహించలేక అలాంటి రాళ్ళు నా వద్ద చాలా వున్నాయన్నాడు మీ రారా. యూనివర్సిల్ పండితుడు-

**మధుర:** అదిసరేగాని, ఆ మిరియాల కషాయాన్నంతా ఎలా మింగారు ప్రభువా?

**శ్రీశ్రీ:** 'మ్రింగు మనె సర్వమంగళ, మంగళసూత్రమ్ము నెంత మది నమ్మినదో'- అనికదా, ప్రమాణం!

**మధుర:** ఆ ఛాందసులకు భావ కవిత్వమే మింగుడు పడలేదు. కృష్ణశాస్త్రి అర్థంకాని వాళ్ళకు శ్రీశ్రీ ఎలా అర్థం అవుతాడు?

**శ్రీశ్రీ:** పాతది పోయి కొత్తది వచ్చినపుడల్లా వీళ్ళు సంప్రదాయమో, సంప్రదాయమో అని గోలెత్తుతూ వుంటారు. రావి శాస్త్రి సారాకథలు రాసినపుడు నెగటివ్ రియాక్షన్ మొదట సంప్రదాయ వాదులనుంచే కదా వచ్చి రచయితను నిరుత్సాహపరిచింది. నాలాంటి వాడు వెన్ను తట్టి ఏకకాలమందు నవ్వూ కన్నీళ్లూ తెప్పించే టానిక్కీ సారాకథలు, అని గుర్తించి ప్రోత్సహించక పోతే రావిశాస్త్రి ఏమయ్యే వాడు?

**మధుర:** అది సర్లెండి కాని-మీరు 'రాజా-మహిషి'ని గురించి కాబోలు అదిపూరీ-జగన్నాథస్వామి విగ్రహంలో అసంపూర్ణంగా వున్నప్పటికీ పూజలందుకుంటుంది అన్నారు-అలా ఎందుకన్నారో తెలుసుకోవచ్చా?

**శ్రీశ్రీ:** వెర్రిదానా, జగన్నాధస్వామే నా చేత అలా పలికించాడు అని ఎందుకనుకోవు?

**మధుర:** అదల్లావుంచితే, మీరిద్దరూ చలంతో కలిపి బెటర్ దాన్ గురజాడ అంటారు దానికి మీరేమంటారు?

**శ్రీశ్రీ:** గోదావరి చూసిన వారికి నాసికాత్రయంబకం వద్ద కంటే రాజమండ్రి వద్ద దాని విశ్వరూపం కనిపిస్తుంది. గురజాడకీ మాకూ అదీ తేడా-అది ఎల్లాంటిదంటే నువ్వు రామప్పంతులికి గుండుమీద రాసి ముద్దు పెట్టుకున్న సీనుకీ సౌజన్యారావు పంతుల్ని 'ఓ చిన్న ముద్దుకి కరువో!' అని అడిగిన సీనుకీ వున్న అంతరం లాంటిది ఇక్కడ రామప్పంతులూ సౌజన్యారావూ ప్రధానం కాదు, ముద్దూ మధురవాణీ మాకు ప్రధానం.

**మధుర:** ఎంత చక్కగా చెప్పారండీ! 'రత్తాలు-రాంబాబు'లో రావిశాస్త్రి ఒకానొక ప్రొలిటేరియన్ మధురవాణిని సృష్టించారు. ఆవిడ 'ముత్యాలు' అనుకుంటా- ఐలైక్ హర్.

**శ్రీశ్రీ:** రావిశాస్త్రి రాతలన్నీ నువ్వూ చదివావా?

**మధుర:** అన్నీ చదవాలా ఏమిటి? నాక్లయింట్సంతా నేను వృత్తి మానేశాక వారి దగ్గర చేరారు. పైగా నాకు వారి 'నిజం' నాటకంలో శ్యామల వేషం వేద్దామని ఎంతో సరదాగా వుండేది. దట్సాల్!

**శ్రీశ్రీ:** అప్పారావుగారు కోకోవైన్ లాటిది తీసుకునే వారట. పురిడి పిట్ట మాంసం కూడా వారికి ఎంతో యిష్టంట - యివన్నీ వారి డైరీల్లో వున్నాయి. నీవు ఎప్పుడయినా కించిత్తు 'వైన్' సేవించావా?

**మధుర:** అటువంటివి మీరు అడక్కూడదు, నేను చెప్ప కూడదు. అన్నట్లు మీరు నజ్రుల్ ఇస్లాం బిద్రోహ కవిత విని మరో ప్రపంచం - జగన్నాథ రథచక్రాల్ రాశారంటారు అవునా?

**శ్రీశ్రీ:** ఒక పద్యం రూపుదిద్దుకోవడానికి వెనుక నేపథ్యంలో ఎన్నో ఆకార వికారాలుంటాయి. అవన్నీ చెప్పడం కష్టం. మాట వరసకి - నేనో మాటు విశాఖపట్నంలో లైట్ హవుస్

ఎక్కి సముద్రం చూశాను. అప్పుడు అక్కడ్నుంచి సముద్రం కెరటాలు నాకెలా కనిపించాయంటే ఉరకండీ ఉరకండీ ముందుకు' అని అంటూ రాసేందుకు నన్ను ప్రేరేపించాయి. దానికే మంటావు?

**మధుర:** అద్భుతం అంటాను. యింకేమంటాను? మీ సర్రియలిస్ట్ కవిత్వంట, అదేదో కాస్త వినాలనుంది.

**శ్రీశ్రీ:** దానికేవిటి?

మింగితిమింగిలంగిల తమిస్ర గుహాంతర మీన మేషపా
రంగతులైన బొంగరములార, యెటింగిన తెల్పుడీ పరి
ష్వంగము లాడు టెందుకు? విపంచికి కంచికి దూరమెంత? వ
డ్రంగుల రంగులా? గులక రాళ్ళగు మా గుడిలోని లింగముల్ ?

**మధుర:** భేష్ భేష్ (నవ్వి) - యీ ఆడుచున్న మాటలకి అర్థం ఏవిషండి?

**శ్రీశ్రీ:** నీ గిరీశం గార్నడుగు-

**మధుర:** నీ గిరీశం అంటున్నారు ఏమిటి కథ?

**శ్రీశ్రీ:** గిరీశం మీద ఈగ వాలనివ్వవు కదా!

**మధుర:** మీరేమో అన్నీ చక్కగా చదువుకున్నారు; కుర్ర వాళ్లని మాత్రం ఛందో బందో బస్తుల్ని చట్ ఫట్‌మని తెంచమన్నారేవిటి?

**శ్రీశ్రీ:** అంటే ఏం ప్రమాదం?

**మధుర:** ప్రమాదమా ప్రమాదంన్నరా? వాళ్లందరూయిప్పుడు భాషానియమాల్ని కూడా లెక్క చేయకుండా వచన కవిత్వాలంటూ వెర్రి మొర్రి రాతలు రాస్తున్నారు అందుకే అజంతా 'శ్రీశ్రీ తరువాత అంతా శూన్యం' అన్నది. ఛందస్సుండడం వల్లే మీ కవిత్వం ఎంతో మందికి కంఠస్థం వొచ్చింది ఇప్పటి వచన కవులకి ఎవరిది వారికే పదిలైన్లు గుర్తురాడం లేదు; వెధ్వల్.

**శ్రీశ్రీ:** వెధవలంచున్నావ్ ?

**మధుర:** (నవ్వి), అది లాటిన్ టెర్మ్- వెధ్వల్ అంటే విస్కీసీసాలు

**శ్రీశ్రీ:** చివరికి నన్ను కూడా ఓ గిరీశాన్ని చేసి ఆటలాడిస్తున్నావా?

**మధుర:** నాచ్చి కొశ్చెన్, సోషల్ రిఫార్మ్; రెంటినీ భ్రష్టు పట్టించిన గిరీశం గారితోనా, మహాకవికి పోలిక? అపరాధం! అపరాధం!

**శ్రీశ్రీ:** మొత్తానికి నన్ను మహాకవి అని అంగీకరించావన్న మాట!

**మధుర:** మీ తరవాత మీ అంతగాకపోయినా చెప్పుకో తగ్గ ఫాలోయింగ్ లేకపోవడానికి మీరా కమ్యూనిజమా కారణం?

**శ్రీశ్రీ:** నన్నూ, నా కవిత్వాన్ని మెచ్చుకుంటూ కమ్యూనిజాన్ని తిట్టే వాళ్లలో నువ్వూ చేరి పోతున్నావా ?

**మధుర:** కన్యాశుల్కంలోని ఏ పాత్రా తదనంతరం కమ్యూనిస్టుగా మారడానికి వీల్లేదు. జాగ్రత్తగా చదివి చూడండి.

**శ్రీశ్రీ:** వాటీజ్ దిస్?

**మధుర:** మీ కమ్యూనిస్టులకి సమాజం అంతా అక్కర్లేదు అందులోని కొంత భాగంతోనే వారికి ప్రమేయం. లోకాస్సమస్తా స్సుఖినోభవంతు వారి ధ్యేయం కాదు అందుకే ప్రజల్లో కొందరికే మీరు మహాకవి మీరు రాణించింది మీ స్వర్థవల్ల - గురజాడ యుగకర్త కాదు. ఈ యుగం నాది అంటూ తగూ దేనికి మీకు?

**శ్రీశ్రీ:** ఆ మైకంలో అలా అనాల్సొచ్చింది

**మధుర:** సినిమా మీ అశాశ్వత, శాశ్వత చిరునామా కాదా!

**శ్రీశ్రీ:** వేళాకోళానికైనా తగదు, నీవా మాట అనడం. అయితే కృష్ణశాస్త్రి కూడా సినిమా కవేనా?

**మధుర:** మిమ్మల్ని బతికించిన దాని మీద మీకు గౌరవం లేదు కమ్యూనిస్టులు కదా నమ్మరు దేన్నీ - కవిత్వాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళింది సినిమా అని ఒప్పుకుంటారా, ఒప్పుకోరా? శ్రీశ్రీ శ్రీరామాంజనేయ యుద్ధం ఫేమ్ అని ఎవడో సినిమావాడు పోస్టరు మీద రాసినందుకు చేరా గారు గింజుకోలేదా? అంతే-

**శ్రీశ్రీ:** చేరా కూడా నీకు తెలుసా? మహాపాపం. వృత్తి మానేశాక నీలో సరసం కూడా మృగ్యమయినట్లుందే? భగవద్గీత చదివి యిలా తయారయావన్న మాట

**మధుర:** (నవ్వి), అదంతా సౌజన్యారావు పంతులు దయ. అవును మీరు తెలుగు కవిత్వానికి ఏకలవ్యుడి బొటనవ్రేలులాటి వారట కదా?

**శ్రీశ్రీ:** శ్రామికోద్యమం నేనూ సహచరులం అందుకే ఆ మాట అంటారు నన్ను.

**మధుర:** మీ కవిత్వం ప్రభావమయింది మధ్య తరగతిలో - మీ ప్రేమ మొగ్గు అటువైపు శ్రామికుల్లో మీ కవిత్వం ఎంతమంది జుర్రుకున్నారు?

**శ్రీశ్రీ:** జుర్రుకోవడానికి పాయసమా, పెరుగా? కనీసం విస్కీ అన్నా అయితే-

**మధుర:** మీ శ్రామికులు నాలిక తడుపుకునే వారేమో. మీరంతా దొంగలు. మిమ్మల్ని అసలే గుర్తించని శ్రామికవర్గం మీదనే మీకు మోజు. మీ కవిత్వాన్ని గుర్తించిన చైతన్యం మధ్య తరగతిలో వున్నా సరే వాళ్లంటే మీకు పడదు; చిన్నచూపు ఈట్రాజిడీ మీరు కల్పించుకున్నదే-

**శ్రీశ్రీ:** అధోజగత్సహోదరులు మేల్కొనాలని అలా అరిచీ కేకలేశాను అది తప్పా?

**మధుర:** వరకట్నం, వేశ్యా సమస్య, యింకా చాలా సంఘ సంస్కరణల్ని పుస్తకాల్లో

పరిష్కరించేసినా జీవితంలో అవి ఎదురు ప్రశ్నల్లా అలా వుండి పోయాయి చిత్రంగా. కవులు ముందుండడవంటే యిదే యిబ్బంది కాబోలు.

**శ్రీశ్రీ:** కవులు ముందుండ కూడదా?

**మధుర:** ఏం ముందుండడమో - మీరు విరసం పెట్టి పోలీసువాళ్ళ పని సుళువు చెయ్యలేదా?

**శ్రీశ్రీ:** పోలీసుల పని సుళువు చెయ్యడవేమిటి?

**మధుర:** విప్లవోద్యమం రహస్య స్వభావాన్ని మీ కవిత్వాలు రాతలు ఉపన్యాసాల్లో బట్ట బయలు చెయ్యలేదా? మీరు కంపెనీ పెట్టి పోలీసుల పని మేడీజీ చేశారు కుర్రాళ్ళని అప్పగించి.

**శ్రీశ్రీ:** నక్సలైట్ అన్నమాట డిప్షనరీల కెక్కిన పదం ఈ భూస్వామ్య పెట్టుబడిదారీ ధనిక స్వామ్యం పోవాలంటే ఎన్ని శ్రీకాకుళాలు రావాలో? ఎన్ని నక్సల్‌బరీలు రావాలో? నీకేం తెలుసు

**మధుర:** చదువులు పాడు చేశారు. బంగారం లాంటి కుర్రాళ్ళని పోలీసుల కప్పజెప్పి చంపించేశారు కవులేం యుద్ధాలు చేస్తారు? మీ కవిత్వాలవల్ల ఏం జరుగుతుంది? విప్లవం అంటే ఆడపిల్లల బడిలో అటెండెన్స్ రిజిష్టరు తస్కరించడమనుకున్నారా?

**శ్రీశ్రీ:** అది చిన్నప్పటి మాట. సరదాకొసని కొరడా, కొరడా కొసని సరదా నీ ఆలోచన ఆయస్కాంతం ఓ పద్యం విసురుతా విను

''వచ్చెడు వాడు ఫల్గుణుడు వార్ధి తరంగ మృదంగ ఘోషలో
వచ్చెడు మచ్చు మందు పలవించెడు కించి దుషస్తుషారముల్
పచ్చిక మచ్చికైనది ప్రపంచపు నెత్తురు మంట పాటలన్
మెచ్చునివాడ నీ మెడల మీద నివే ఉదయాద్రి రౌద్రముల్''

**మధుర:** మీ కవితల నిండా పురుషాహంకారమే మీరే అసలు సిసలైన మగ కవులు. ఫ్యాక్టరీలు లేకపోతే కవిత్వం రాయలేను అన్నారుగా?

**శ్రీశ్రీ:** అంటే మిగతావారు కారనా?

**మధుర:** ప్రేయసి మెల్లకన్ను మీద పద్యాలు చెప్పేవారితో మీకు పోలికా?

**శ్రీశ్రీ:** ప్రేయసి కోకన్నుంది, అది మెల్లో గిల్లో; ప్రబంధ సుందరికంటే నయమే కదా!

**మధుర:** కాని, నినాదశక్తిని నాదశక్తిగా కూర్చగల కవిత్వ మహత్వ పటుత్వ సంపదలు మీవి. భువన భవనపు బావుటా ఎగరేసింది మీరు. జెండా లాంటి వారు జెండా యుద్ధం చెయ్యదు

**శ్రీశ్రీ:** సరసుల్ని కనిపెట్టడంలోనే నీకు నేర్పు వుందనుకుంటే కవుల్ని కూడా కరక్టుగా పోల్చగలవే.

**మధుర:** అవునూ - మానవుడే నా సంగీతం, మానవుడే నా సందేశం అన్న మిమ్మల్ని దేవుని వితంతువు అని అనడం ఏం బావుంది?

**శ్రీశ్రీ:** భర్తలేడు అన్నాక లేవట్టేకదా. అప్పుడు భర్తలేనిభార్య వితంతువు అయినట్లే సదసత్సంశయాన్ని వీడి, దేవుడు లేడు అని తెలుసుకున్నాక శ్రీశ్రీ దేవుని వితంతువయ్యాడని వేళాకోళం.

**మధుర:** అంటే కామ్రేడ్స్‌తో పాటు నాస్తికులు హేతువాదులు అంతా దేవుని వితంతువులైతే - మరి ఆ బాపతు స్త్రీలు ఏమవుతారు?

**శ్రీశ్రీ:** భక్త మీరా చెప్పినట్లు ఆ జగద్రక్షకుడొక్కడే పురుషుడు; మిగతా వారంతా స్త్రీలే అన్నట్లు చెప్పుకోవాలి. ఎమర్జెన్సీలో ''ఇందిరాగాంధీ ఇండియాలో ఉన్న ఒకే ఒక పురుషుడు'' - అని ఎవరో అన్నట్టు !

**మధుర:** మీరు ఆ ఉగ్రశైవులతో ఎలా వున్నారో అని ఆశ్చర్యం

**శ్రీశ్రీ:** ఉగ్రశైవులేమిటి?

**మధుర:** మీరన్న మాటలే మీకు గుర్తుండవు. మీకు సాహిత్య అకాడమీ ఢిల్లీ అయిదు వేల రూపాయల బహుమతి యిచ్చినపుడు మీరేమన్నారు?

**శ్రీశ్రీ:** ఓహోఅదా - తిడుతూ ప్రకటన యివ్వమనీ, అవార్డు తిరస్కరించ మనీ ప్రసాదూ, రమణారెడ్డీ నా వెంట తగిలారు డబ్బూ నోరూ రెండూ పారేసుకోవడం తప్ప దీనికింకో ఫలితం వుండదు

**మధుర:** యింకా మీరేమన్నారో ఓసారి గుర్తుకు తెచ్చుకోండి

**శ్రీశ్రీ:** సెన్సారు నిబంధనల్ని సరిగా అమలుచేస్తే ఒక్క పిక్చరు తీయడం కూడా ఎలా అసాధ్యమో - విరసం నిబంధనలూ అలాటివే అన్నాను. వాటి ననుసరిస్తూ అడవుల్లో బతకాలే తప్ప, నేటి పెట్టుబడిదారీ సమాజంలో బతకలేం అన్నాను

**మధుర:** అలా కాదు, పాపిష్టి సొమ్ము. అందుకే మాఅవిడ బతక లేదన్నారు. ఈ సంగతి తెలుసా? గిరీశం గారు ప్రత్యేక తెలంగాణా కావాలనీ వారి శిష్యుడు వెంకటేశం సమైక్య ఆంధ్రం వుండాలనీ విడిపోయి దెబ్బలాడుకున్నారట.

**శ్రీశ్రీ:** అప్పుడు నువ్వే మన్నావుట?

**మధుర:** నేను మీ పక్షమే - లాంగ్ లివ్ తెలుగు ప్రజల యూనిటీ అన్నాను. ఈ పాయింటు మీద మీరు విరసంతో విభేదించడం శ్రీశ్రీ యిమేజ్‌ని పెంచింది.

Unity of all Andhra is an article of faith with me. అయితే వాళ్ళు కాళ్లా, వేళ్లా బతిమాలి నా రాజీనామా ఉపసంహరించుకునేట్లు చేశారు.

**మధుర:** ఎందుకలా చేశారు?

**శ్రీశ్రీ:** నాపేర్లోనే రెండు యస్‌లున్నాయి దేనికైనా 'నో' అనడం నావల్ల కాదు.

**మధుర:** మిమ్మల్ని ఎవరు డిస్కవర్ చేశారు మొదట?

**శ్రీశ్రీ:** పురిపండా అప్పలస్వామిగారు. తరవాత ఆయన్ను నేను రీడిస్కవర్ చేయాల్సి వచ్చింది; 'సౌదామిని అండ్ అదర్ పోయెమ్స్' యింగ్లీషులోకి తర్జుమా చేసి

**మధుర:** అన్నట్లు నారాయణబాబుకీ మీకూ ఏమిటి గొడవ?

**శ్రీశ్రీ:** వాడూ శ్రీరంగం వాడు కావడమే. అది వాడి బ్యాడ్‌లక్

మధుర. ఆ సంపెంగ తోట తగువేమిటి?

**శ్రీశ్రీ:** అది నటాలి వాళ్ళడిగితే నారాయణబాబు ముందు చేశాడు అది అబ్బూరి రామకృష్ణా రావు గారికి నచ్చలేదు వరద చేతా నా చేతా మళ్ళీ అంతా రాయించాడు. అబ్బూరి వారన్నట్లు కీర్తిగాని అపకీర్తికాని స్వతంత్ర రచనలద్వారా ననుసరించి వుంటుందికాని అనువాద రచనల్తో కాదు గదా!

**మధుర:** మొత్తానికి విజయనగరం వాడైనందుకు రావిశాస్త్రి చెప్పినట్టు రామప్పంతులని పించుకున్నాడు నారాయణబాబు. ఊరుకున్నాడా ఊరుకున్నట్టే. అంటుకుంటే మాత్రం ఆ పరమేశ్వరుడు కూడా అర్పలేడు యుద్ధంలోనూ కోర్టుల్లోనూ వాని వరసలు లెక్కకు రావు.

**శ్రీశ్రీ:** కీపిట్ ఎసైడ్ నేను పుట్టీ పెరిగింది విశాఖపట్నంలో అందుకే శ్రీశ్రీ కేరాఫ్.. విశాఖపట్నం నా ఒకప్పటి చిరునామా

**మధుర:** మిమ్మల్ని కొత్త దారులంట పరిగెత్తించిన శక్తి ఏమిటో?

**శ్రీశ్రీ:** మొదటిది నే ననుభవించిన దుర్భరమైన దారిద్ర్యం రెండోది విశాఖపట్నం వాతావరణం. మూడోదీ ముఖ్యమైనదీ, నాకు వచ్చిన టైఫాయిడ్ జ్వరం. ఈ అవస్థల్లోంచి నన్ను నేను వెతుక్కున్నాను. నాకు పట్టు దొరికింది

**మధుర:** మీ తరువాత వాళ్ళకి యీ మూడూ లేక పోవడమే వాళ్ళరాతలు వెలవెలపోవడానికి కారణం అవునా?

**శ్రీశ్రీ:** కొంతమందికి ఉత్సాహం ఉన్నంతగా నైపుణ్యం వుండదు కొత్తశక్తులు కొత్త రూపంలో సాక్షాత్కరించాలి ఒకప్పుడు కర్ర దొరికితే కుక్క దొరకదు కుక్క దొరికితే కర్ర దొరకదు అన్నట్లు వుంటుంది. ఇది చిక్కే - ఏం చేస్తాం?

**మధుర:** అన్నట్లు మీరాక కోసమే మా గురువుగారు గ్రాంథిక భాషారణ్యాన్ని కొట్టేసి దారి సుగమం చేశారు. కాని, అది తెలుసుకోవడానికి మీకు టైఫాయిడ్ రావలిసొచ్చింది. ఆశ్చర్యం-

**శ్రీశ్రీ:** నువ్వు మటుకు సుఖపడ్డావా? నీ దగ్గర కొచ్చేవాడు దేని కోసం వస్తాడు? దేని కోసం వచ్చాడో అది యివ్వడం వాడికి సుఖం నీకు నరకం కాదా?

**మధుర:** చిత్రం, నా గురించి ఎందుకాలోచిస్తారు? సానిదానికి సుఖంతో పనేమిటి?

**శ్రీశ్రీ:** సుఖం అనేది పొట్లపాదు మీది గొంగళి పురుగు. కవిత్వం ఉగ్రతపశ్చర్య. నీలాగే కవీ సుఖపడతాడు.

**మధుర:** నాలాగే అంటే-

**శ్రీశ్రీ:** ఆడవాళ్ళ గురించి 'దివా కాకరుద్భీతా రాత్రౌతరతి నర్మదా' అన్నారు. రాత్రి నెదుర్కొనే శక్తి ఆడవాళ్ళకి వుంటుంది కాని నువ్వు పగళ్ళనూ రాత్రుళ్ళనూ కూడా ఎదుర్కోగల జాణవి అందుకో, నా ''రెడ్ శాల్యూట్''!

**మధుర:** (నవ్వి) మీరు నన్ను వెడగొడుతున్నారు. మీరేం చేశారో తెలుసా?

**శ్రీశ్రీ:** చెప్పు ఏం చేశాను? భద్రత కోసం బాధ్యతల్ని మరిచా నంటావా?

**మధుర:** అలా అనను మా గురువు గారు దివిజ గంగను భువికి తెస్తే మీరు తెలుగును పోరాటానికి అనువయిన భాషగా మార్చారు. మార్చి ప్రజల చేతిలో ఆయుధమై నిలిపారు

**శ్రీశ్రీ:** 1915లో గురజాడ నిర్యాణంతో ఆగిన ఉద్యమాన్ని - (అంటే నాది ప్రజల ఉద్యమం; నేను దేని కోసం దీన్ని వదులుకోను.' అని మహాకవి చేసిన ప్రకటనను) ఆయన తర్వాత చేపట్టి భూమార్గం పట్టించి భూకంపం పుట్టించాను. జీవన సౌఖ్యాన్ని కంటగించుకోకపోతే యివేమీ సాగేవి కావు.

**మధుర:** నరకంలో టీవీ వుందా? మీకు పేపర్లన్నీ అందుతూ వుంటాయా?

**శ్రీశ్రీ:** ఏం అలా అడిగావు? నరకం అంటే వేళాకోళంగా వుందా?

**మధుర:** ఈ మధ్యన గిరీశంగారు అయ్యో శ్రీశ్రీ-పాపం శ్రీశ్రీ అంటూ మీ కోసం కంగారుగా తిరుగుతున్నారు.

**శ్రీశ్రీ:** నాతో పనేమిటి?

**మధుర:** మీకు యినుప తెరలు కూలిపోవడం, సామ్యవాదానికి నూరేళ్ళు నిండడం; ఇవేవీ తెలియవా?

**శ్రీశ్రీ:** అబద్ధం! ఇదేదో అమెరికా సామ్రాజ్యవాదుల కుట్రో, సిఐఏ కల్పనో అయివుంటుంది.

**మధుర:** గోర్బచెవ్ పేరు విన్నారా? పెరిస్ట్రోయికా, గ్లాస్‌నోస్త్ తెలుసా?

**శ్రీశ్రీ:** నాకేదో షాక్ ట్రీట్‌మెంటు యివ్వాలని నువ్వు ట్రై చేస్తున్నావ్. ఇదివరకే ఒకటి రెండు సార్లు .

**మధుర:** అందుకే మీరంటే జాలి నాకు. ఎలా చెప్పాలా అని చూస్తున్నా.

**శ్రీశ్రీ:** స్వయంగా అపాయాల్లో కెళ్లడం నా కలవాటే. చెప్పు భయం యిల్లె.

**మధుర:** రెండో రకం పద్యం బాధ పెట్టినట్లు మిమ్మల్ని బాధపెడుతున్నానా? అదుగో గిరీశం గారు వస్తున్నారు

(గిరీశం 'వెల్ మై డియర్ ఎంప్రెస్' అంటూ ప్రవేశం)

**శ్రీశ్రీ:** గిరీశాన్నెందుకు రప్పిస్తున్నావు నా ప్రాణం మీదికి. వద్దు.

**మధుర:** సామ్యవాద స్వప్నం భగ్నమయిందనీ, ఇండియాకి బిగ్ బ్రదర్ మరి లేడనీ, చైనాలో ప్రజాస్వామ్యం కావాలన్న కుర్రాళ్ళని బీజింగ్‌లో అదేదో స్క్వేర్‌లో కాల్చి ఊచకోత కోశారనీ, అక్కడ ఆడవాళ్ళని అమ్ముకుంటున్నారనీ, మావో భార్య ఆత్మహత్య చేసుకుందనీ యివన్నీ గిరీశం గారు మీకు నమ్మకంగా చెప్తారనీ ..

**శ్రీశ్రీ:** నాకెవరూ చెప్పనక్కర్లేదు. అప్రియ సత్యాలు నేను వినదల్చుకోలేదు.

**మధుర:** అయితే హిందూ పత్రిక తెస్తాను. చివరి పేజీలోని క్రాస్‌వర్డ్ పజిల్ పూర్తిచేసు కుంటూ కూర్చుందురు గాని

**శ్రీశ్రీ:** మా వాళ్ళెవరైనా వస్తే-

**మధుర:** మీ వాళ్ళెవరూ రారు. వారంతా యింకా స్టాలిన్ యుగంలో వున్నారు స్టాలిన్ శరణం గచ్ఛామి! మావో శరణం గచ్ఛామి!

**శ్రీశ్రీ:** కమ్యూనిజం గురించి చెడు వినను, చెడు చూడను, చెడు మాట్లాడను.

**మధుర:** డామిట్! కథ అడ్డంగా తిరిగింది!

**శ్రీశ్రీ:** తిరిగినా సరే - ఫస్ట్ థింగ్స్ ఫస్ట్. వేరీజ్ మైడ్రింక్? ★

*(మిసిమి - జూన్, ఆగస్టు 1991)*